క్లుప్తంగా

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు, వితంతువులకు చీరలు పంపిణీ చేసిన దృశ్యం

కొయ్యలగూడెం: హైదరాబాద్‌కు చెందిన జీసస్ క్రీస్ట్ ఆఫ్ నజరేతు మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు శ్యామ్ కిషోర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కిచ్చప్పగూడెంలో వృద్ధులకు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని దిప్పకాయలపాడు సర్పంచ్ సున్నం శాంతకుమారి పేర్కొన్నారు. చిన్నారులతో కలిసి ముందుగా కేక్ కట్ చేసి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ కన్వీనర్ కుర్సం మురళి, సున్నం వెంకటేశ్వరరావు, సరియం బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన



గంగవరంలో డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ పరిధిలోని గంగవరంలో రూ.5 లక్షల మండల పరిషత్ నిధులతో డ్రెయినేజీ నిర్మాణానికి ఎంపీపీ గంజిమాల రామారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, ఎంపీటీసీ చింతయ్య, వార్డ్ మెంబర్ రేణుక బాల, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

12న ఉచిత నేత్ర వైద్యశిబిరం



ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: చేగొండపల్లి గ్రామంలో ఈనెల 12వ తేదీన ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓఎన్‌జీసీ సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయ నేత్ర వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా చేగొండిపల్లిలో ఉచిత వైద్యశిబిర ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనిల్ కుమార్, బొడ్డు కృష్ణ, పట్టిసీమ, ప్రగడపల్లి, చేగొండపల్లి గ్రామాల సర్పంచులు, ఎస్టీయూ యూనియన్ నాయకులు, ఐటీడీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్యామల హరికోటికి నారీరత్న పురస్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు, నగరానికి చెందిన శ్యామల హరికోటికి నారీరత్న అవార్డు లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం విజయవాడ గాంధీ నగర్ ఆశిష్ ఫంక్షన్ హాల్లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తెలుగు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలతో జాతీయస్థాయిలో సేవలు చేస్తున్న మహిళలను నారీరత్న పురస్కారాలతో సత్కరించారు. దీనిలో భాగంగా శ్రీశ్రీ కళావేదిక ద్వారా ఏలూరు జిల్లాలో సాహిత్య సేవలు అందిస్తున్న శ్యామల హరికోటికి ఉమన్ ఎక్సలెన్సీ అవార్డు-2025ను ప్రదానం చేసి శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీశ్రీకళావేదిక జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీ భూషణం, ప్రధాన కార్యదర్శి టి.పార్థ సారథి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో అన్ని వ్యాధులూ దూరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆయుర్వేద వైద్య విధానంలో అన్ని రకాల వ్యాధులనూ నయం చేయవచ్చని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ నగేష్ తెలిపారు. ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ నగేష్ బృందం ద్వారా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిలో లభించే స్వచ్ఛమైన ఆకులు, వేళ్ళు ఇతర పదార్థాలతో తయారు చేసిన మందులను ఆయుర్వేద వైద్యంలో అందిస్తామని, దీనితో ఎలాంటి సైడ్ ఎఫెక్స్ ఉండదన్నారు. వంటింటిలో దొరికే అనేక దినుసులతో వివిధ వ్యాధులకు, అనారోగ్యాలకు విముక్తి లభిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమున్న అందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సాగులో ‘డ్రోన్ల’ సాయం

- మందుల పిచికారీలో సాంకేతికత
- ఖర్చుతోపాటు సమయం ఆదా
- ఆసక్తి చూపుతున్న రైతులు





బుట్టాయగూడెం మండలం కండ్రికగూడెం వద్ద పొగాకు పంటకు డ్రోన్‌తో స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఏజెన్సీ మెట్టప్రాంతంలోని రైతులు పాత సాగు విధానానికి స్వస్తి పలికి అధునాతన సాంకేతిక వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. వ్యవసాయ సాగులో కొత్త ఒరవళ్లతో అధిక దిగుబడులు సాగించేలా ఆలోచన చేస్తున్నారు. ఇందులో భాగంగా సాగు చేసిన పంటలకు తెగుళ్లు సోకితే డ్రోన్‌ల ద్వారా రసాయనిక ఎరువులు స్ప్రేయింగ్ చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న పంటలకు డ్రోన్‌లతో స్ప్రేయింగ్ పనులు చేయించిన రైతులు ప్రస్తుతం రబీ సీజన్‌లో వర్జీనియా పొగాకు పంటలకు సోకే తెగుళ్ల నివారణకు డ్రోన్‌తో పురుగు మందులు స్ప్రేయింగ్ చేయిస్తున్నారు.

కూలీల కొరతతో అవస్థలు

పంటల సాగు చేశాక వాటి సంరక్షణ ఎంతో కీలకం. పంటలు సాగు చేసిన 20 రోజుల నుంచి పురుగుమందులు స్ప్రేయింగ్ పనులు చేయాల్సి ఉంటుంది. అయితే మందులు స్ప్రేయింగ్ చేసేందుకు కూలీలు దొరకడం ప్రస్తుత రోజుల్లో కష్టంగా మారింది. దీనితో అందుబాటులోకి వచ్చిన ఆధునిక టెక్నాలజీని రైతులు వినియోగంపై ఆసక్తి చూపుతన్నారు. డ్రోన్‌తో స్ప్రేయింగ్‌కు ఎకరాకు రూ. 500 తీసుకుంటున్నారు. అదే కూలీలతో పంటలకు స్ప్రేయింగ్ పనులు చేయించాలంటే ఎకరాకు రూ.1000 ఖర్చు అవుతుందని, అలాగే సమయం కూడా పడుతుందని చెబుతున్నారు. డ్రోన్‌లు వినియోగం వలన ఖర్చు తగ్గడంతో పాటు సమయం కూడా కలిసి వస్తుందని రైతులు చెబుతున్నారు.

డ్రోన్‌ల సాయం అవసరం

పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి, పోలవరం, టి. నర్సాపురం, కొయ్యలగూడెం మండలాల్లో రైతులు వరి, మిరప, మొక్కజొన్న, అరటి, వేరుశనగ, చెరకు, పంటలతోపాటు రబీలో అత్యధికంగా పొగాకు పంటలను పండిస్తున్నారు. వ్యవసాయ పనుల్లో కూలీల కొరత వలన ఇటీవల కాలంలో రైతులు డ్రోన్‌ల వినియోగంపై ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ఐదు ఎకరాల్లో పంటలకు డ్రోన్‌తో స్ప్రేయింగ్ చేయాలంటే రూ. 2000 ఖర్చు అవడంతోపాటు సమయం కూడా కలిసి రావడంతో డ్రోన్‌ల సహాయంతో స్ప్రేయింగ్ పనులు చేస్తూ గంటలోపే పనులను పూర్తి చేసుకుంటున్నారు.

సమయం, ఖర్చు ఆదా



డ్రోన్‌ల ద్వారా పంటలకు పురుగుమందుల స్ప్రేయింగ్ చేయడం ద్వారా సమయంతోపాటు ఖర్చు కూడా తగ్గుతుంది. స్ప్రేయింగ్ పనులు చేసేందుకు రెండు గ్రూప్‌లను ఏర్పాటు చేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. త్వరలోనే రైతులకు అందుబాటులోకి డ్రోన్‌లను తీసుకురావడం ద్వారా మరింత సేవలు అందేలా కృషి చేస్తున్నాం.

– డి.ముత్యాలరావు, మండల వ్యవసాయాధికారి

రోజుకు 50 ఎకరాల వరకూ స్ప్రేయింగ్ చేస్తున్నా



నేను విజయవాడలో డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ పొందాను. 2 డ్రోన్‌లను సొంతంగా కొనుగోలు చేసి పంటలకు స్ప్రేయింగ్ పనులను చేస్తున్నాను. రోజుకు 40 నుంచి 50 ఎకరాల వరకూ స్ప్రేయింగ్ పనులు చేస్తున్నాను. ఎకరానికి రూ. 450 వరకూ తీసుకుంటున్నాను. డ్రోన్‌ల వల్ల ఖర్చు తగ్గడంతో రైతులు దీని వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు.

– పోలుబోయిన దేవసాయి, డ్రోన్ ఆపరేటర్, కొయ్యలగూడెం మండలం

శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు



ఆలయ పునర్నిర్మాణ పనులు నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: బొర్రంపాలెం శ్రీ వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో, ఆ ఆలయాన్ని పునర్నిర్మించేందుకు భక్తులు నిర్ణయించారు. ప్రస్తుతం నిర్మాణం శరవేగంగా జరుగుతుండగా, ఆదివారం గడప నిర్మాణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయం వద్ద ప్రతి మంగళవారం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడపా నాగరాజు, మధు, అప్పన పుల్లారావు, శ్రీకాంత్, బాలు తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



లలితా సహస్ర పారాయణ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ఆవాహిత సకల దేవత మండపారాధన, సాయంత్రం సామూహిక లలితా సహస్ర పారాయణం, సహస్ర దీపాలంకరణ కార్యక్రమం, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీ సుదర్శనం వేణుగోపాలచార్యులు వైభవంగా పూజా కార్యక్రమాలు జరిపారు.

అలరించిన కాళికా విజయం నృత్య రూపకం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సకల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నగరానికి చెందిన దువ్వి రామారావు కళారంగ ప్రవేశ 60 వసంతాల వేడుకల్లో భాగంగా ప్రదర్శించిన కాళికా విజయం నృత్య నాటిక ప్రేక్షకులను విశేషంగా అలరించింది. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం రాత్రి నగరానికి చెందిన అభినయ నృత్య భారతి సంస్థ, సకల కళాకారుల సంక్షేమ సంఘం, నాగపూర్‌కు చెందిన అఖిల భారత తెలుగు సేన, హైదరాబాద్‌కు చెందిన నృత్య దర్పణ సంస్థలతో పాటు పలు సాంస్కృతిక, స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కళారంగ ప్రవేశం చేసి 60 వసంతాలు పూర్తి చేసుకున్న దువ్వి రామారావును ఘనంగా సన్మానించారు.

బాధ్యతల స్వీకరణ

జంగారెడ్డిగూడెం: ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ జంగారెడ్డిగూడెం గోల్డ్ నూతన కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చార్టర్ అధ్యక్షురాలుగా నాగసూరి మాధురి, కార్యదర్శిగా ఎస్.పద్మజ్యోతి, కోశాధికారిగా జీ.ఆదిలక్ష్మిలతో క్లబ్ జిల్లా చైర్మన్ ఎ.లక్ష్మీశ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కమిటీ జూన్ 30, 2026 వరకు కొనసాగుతుందని లక్ష్మీశ్రీనివాస్ తెలిపారు. అనంతరం రూ. 2 లక్షలు విలువైన సేవా కార్యక్రమాలను నూతన కమిటీ నిర్వహించింది.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రం అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన ఎం.మేఘన అనే భక్తురాలు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ముందుగా ఆమె కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

నేటినుంచి మదనగోపాల స్వామి కల్యాణోత్సవాలు

- ఐదు రోజులపాటు ఉత్సవాల నిర్వహణ
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.కోటి 30 లక్షలతో ఆలయ పునర్నిర్మాణం





శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి, స్వామి వారి ఆలయం

కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి వారి కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఫాల్గుణమాస ఏకాదశి సందర్భంగా వైఖాన ఆగమ పండితులు ఆచార్య శ్రీమాన్ శ్రీనివాసుల శేషాచార్యులు, లక్ష్మీనారాయణ పార్థసారథి, ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి వెంకట రామా శేషాచార్యుల ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 10వ తేదీన ప్రత్యేక పూజలతో పాటు స్వామివారి కల్యాణం, 11న గ్రామోత్సవం, 12న నిత్య, ప్రధాన హోమాలు, 13న మహా శాంతి హోమం, చోరోత్సవ కార్యక్రమాలు, 14న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజ అవరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ అధ్యక్షుడు మద్దు గోపి తెలిపారు.

రూ.కోటి 30 లక్షలతో ఆలయ పునర్నిర్మాణం

రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి వారిని పదకొండు శనివారాలు దర్శిస్తే కోర్కెలు నెరవేరతాయని భక్తుల నమ్మిక. ఈ ఆలయానికి సుమారు 250 సంవత్సరాలకుపైగా చరిత్ర ఉంది. గత వైఎస్సార్ సీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కృషితో ఆలయం అభివృద్ధికి నోచుకుంది. దేవాదాయ శాఖ పరిధిలోని నిధులతో సహా టీటీడీ, శ్రీవాణి నిధుల నుంచి, అదేవిధంగా భక్తుల నుంచి సేకరించి విరాళాలు కలిపి దాదాపు రూ. కోటి 30 లక్షలకు పైగా నిధులతో ఆలయాన్ని పునర్నిర్మించారు. 62 సెంట్ల విస్తీర్ణంలో స్వామివారి నూతన ఆలయం, గోశాల నిర్మాణాలతో పాటు లక్ష్మీనరసింహ, వెంకటేశ్వర స్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ఉపాలయాలు కూడా భక్తుల సహకారంతో నిర్మాణం జరిగింది. ఆలయానికి పడమర, తూర్పు వైపుల్లో గాలిగోపురాల నిర్మాణాల ప్రతిపాదనలను గత ప్రభుత్వ పాలనలో అనుమతులు పొందగా అనంతరం పనులు ఆగిపోయాయి. గాలిగోపురాలు, మినీ కల్యాణ మండపం నిర్మించాలని, ఉత్సవాల నిర్వహణకు ప్రతి సంవత్సరం రూ.10 లక్షల ప్రభుత్వం విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు.

దేవుడి మాన్యాన్ని అభివృద్ధి చేయాలి



ప్రస్తుతం స్వామివారికి మిగిలిన మాన్యం దాదాపు 35 ఎకరాలు ఉండగా, కౌలు ఆదాయం ఎనిమిది నుంచి తొమ్మిది లక్షలు మాత్రమే వస్తుండటం విడ్డూరంగా ఉంది. దేవుడు మాన్యాన్ని అభివృద్ధి చేసి బోర్ల నిర్మాణం చేస్తే దేవాదాయ శాఖకు రూ.20 లక్షల వరకు ఆదాయం చేకూరుతుంది. ఎంతో చరిత్ర ఉన్న ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గొలిశెట్టి శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ పబ్లిక్ రిలేషన్ డైరెక్టర్, కొయ్యలగూడెం

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ



గూటాలలో ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



కొలువైన లక్ష్మీనరసింహస్వామి

పోలవరం రూరల్: గూటాల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా జరిగింది. గత ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం చేపట్టారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, మరికొందరు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఏప్రిల్ నెలాఖరులోగా టిడ్కో ఇళ్లు అందజేయాలి



జంగారెడ్డిగూడెం టిడ్కో గృహ సముదాయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

జంగారెడ్డిగూడెం: టిడ్కో ఇళ్లు ఏప్రిల్ 30 లోగా లబ్ధిదారులకు అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఆదివారం జంగారెడ్డిగూడెం పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్రలో భాగంగా పట్టణంలోని మార్కండేయపురం టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందజేయకపోవడం ప్రజల పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూడటమే అన్నారు. సుమారు 864 కుటుంబాల నుంచి అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 25వేల నుంచి రూ. 1లక్ష వరకు సేకరించిందన్నారు. ఇంటి నిర్మాణం చేపట్టింది గాని లబ్ధిదారులకు ఇల్లు అందజేయకుండా మోసం చేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో రావడానికి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సైతం అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే లబ్ధిదారులకు ఏప్రిల్ నెలాఖరులోగా టిడ్కో ఇళ్ల అప్పగించాలన్నారు. అలాగే పట్టణంలో మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు జి.సూర్య కిరణ్, ఎ.ప్రభాకరరావు, వై.సీత, టౌన్ కన్వీనర్ పసల సూర్యారావు, ఎస్‌కే సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



రవన్న వర్ధంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

జంగారెడ్డిగూడెం: ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించడమే సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న)కు అర్పించే నిజమైన నివాళి అని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. ప్రసాద్ అన్నారు. రవన్న 9వ వర్థంతిని ఆదివారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎర్రజెండాలతో పట్టణ వీధుల్లో ప్రదర్శన జరిపారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మోడీ- అమిత్ షాల ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. రాష్ట్రంలోని చంద్రబాబు కూటమి ప్రభుత్వం సైతం అదే బాటలో పయనిస్తోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను, సూపర్ సిక్స్‌ను ఎగవేస్తూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. భవిష్యత్తులో ప్రజల సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలనీ పిలుపునిచ్చారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి సుధాకర్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. శ్రీమన్నారాయణ, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కారం రాఘవ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఉపాధ్యక్షుడు సరియం రామ్మోహన్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు వెట్టి భారతి, పీవైఎల్ డివిజన్ అధ్యక్షుడు కెచ్చెల పోతిరెడ్డి తదితరులు ప్రసంగించారు. అరుణోదయ కళాకారులు అనేక కళారూపాలు, నృత్యాలు ప్రదర్శించారు.

యర్రగుంటపల్లిలో ఎక్సైజ్ దాడులు



యర్రగుంటపల్లి మద్యం సీసాలతో పట్టుబడ్డ నిందితునితో ఎక్సైజ్ అధికారులు

చింతలపూడి: మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో ఆదివారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. పలగాని శ్రీనివాస రావు అనే వ్యక్తి వద్ద నుంచి 11 మద్యం సీసాలును స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పి అశోక్ తెలిపారు. అనంతరం పట్టణంలోని బస్టాండ్, పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, కొరియర్ కార్యాలయం, సచివాలయాల కార్యాలయాల వద్ద సారా, గంజాయి వల్ల కలిగే అనర్థాలను తెలుపుతూ పోస్టర్‌లను అతికించారు. ఈ సందర్భంగా సీఐ అశోక్ మాట్లాడుతూ సారా తయారీ, విక్రయం,, రవాణా, డ్రగ్స్, గంజాయి సరఫరా నేరమన్నారు. అటువంటి నేరాలకు పాల్పడే నిందితుల వివరాలు 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాని స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం 94409 02428 నెంబర్‌కు కాని ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్ ,సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద నిరసన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హిందువులపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులకు వ్యతిరేకంగా సోమవారం ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు హిందూ సంఘాల ఐక్యకార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రామనపూడి శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఈ నెల 4న గ్రామస్తులు నిర్వహిస్తున్న పారేటి గ్రామ ఉత్సాహం (ఊరేగింపు) సందర్భంగా ముస్లింలు ఆకారణంగా హిందువులపై రాళ్లురువ్వడం దారుణని మండిపడ్డారు. ఈ సంఘటనలో పోలీసులు హిందువులపై లాఠీచార్జి చేయడం అన్యాయని పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై కాకుండా హిందువులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలక్టర్ కార్యాలయల వద్ద నిరసనలు చేస్తున్నామని స్పష్టం చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో హిందువులు పాల్గొనాలని కోరారు.

సైక్లింగ్‌తో ఆరోగ్య, పర్యావరణ పరిరక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సైక్లింగ్‌తో ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సాధించవచ్చని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్టేట్ లెవెల్ ఖేలో ఇండియా సెంటర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద నుంచి స్థానిక జ్యూట్‌మిల్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకూ 3 కిలోమీటర్ల సైక్లోథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చంటి ప్రారంభించారు. వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య ఉపాధ్యక్షుడు బడేటి వెంకట రామయ్య, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు పెదబాబు పాల్గొన్నారు.

మహిళలు ముందడుగు వేయాలి



వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజంలో మహిళలపై రాజకీయ, ఆర్థిక, సామాజిక అణిచివేతలను వివక్షతను అంతం చేయాలనే డిమాండ్లతో మహిళా దినోత్సవం ప్రారంభమైందని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు పి.కస్తూరి బాయి తెలిపారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక రామకృష్ణాపురం సాహిత్య మండలి హాలులో మహిళా సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూరిబాయి మాట్లాడుతూ మహిళల కోసం మహిళలే ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సత్తాచాటిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.ఎస్తేరు కల్యాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ డీఎస్ఎస్ చంద్రావతి, హేలాపురి బాలోత్సవం కమిటీ ప్రతినిధి ఆలపాటి నాగేశ్వరరావు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, నిర్వాహక కమిటీ సభ్యురాలు జి.నీలిమ, ఎం. సుకన్య తదితరులు పాల్గొన్నారు.